# నిద్ర

## ఉపద్రష్ట శాయి

డన్‌లప్ ఫోం బెడ్ మీద అటూ ఇటూ తిరుగుతూ కళ్ళు నులుముకుంటూ, ఆవులిస్తూ పడుకుంది కుంతల. ఖరీదైన పట్టెమంచం మెహగనీ చెక్కతో మెరిసిపోతూంది. మంచానికి ఎదురుగుండా వున్న బెల్జియం మిర్రర్‌లో తనను తాను చూసుకుంది. ముప్పై దాటిన తను ముద్దుగా, బొద్దుగా అందంగా వుంది. ఛాయ కూడా ఏ మాత్రం తగ్గకుండా లేత నిమ్మ రంగులో వుంది. ఆరోగ్యం గురించి ఏమంత చెప్పనక్కర్లేదు. శరీరం వుండవలసిన పరిమాణంలో వుంది. అద్దంలో తన అందాలను చూసుకుంటూ అన్నీ వున్న తను ఎందుకిలా వుంది? అనుకుంది.

భర్త కార్తీక్ కోటీశ్వరుడు. భారతదేశంలో ఎన్నో పరిశ్రమలకు అధినేత. అధికార వర్గంలోను, అనధికార వర్గంలోనూ అతనికి గొప్ప పేరుంది. పలుకుబడుంది. ఆర్థికంగా అతనొక గొప్ప వ్యక్తి. పోతే వ్యక్తిగతంగా కూడా అతను ఉన్నత సంస్కారం గల మేధావి. వ్యాపారం విషయంలో అతని సిద్ధాంతాలు ఎలాగున్నా మనిషిగా అందరిచేత మంచివాడనిపించుకున్నాడు. వయసు నలభై లోపుంది. కానీ అతనిలోని బలహీనతలు విసుగు విరామం లేకుండా రాత్రనక, పగలనక ఏదో పని చేస్తూ వుండడం. తన చుట్టూ ఎప్పుడూ కొందరు వుండాలనుకోవడం. దేశంలోని గొప్ప వ్యాపార సంస్థల అధినేతలలో తను వుండాలనుకోవడం, వీటి కోసం తన దాంపత్య జీవితం గురించి ఆలోచించకపోవడం.

"లంకంత ఇల్లు... పది విదేశీ కార్లు - పది స్వదేశీ కార్లు, పెద్ద తోట, గార్డెను, పదిమంది నౌకర్లు అమ్మగారి ఆధీనంలో వుంటారు" అంటాడు కార్తీక్. కానీ ఆ అమ్మగారు కోరుకునేది కార్తీక్ తన అందుబాటులో వుండాలనీ, తన అవసరాలు తీర్చాలనీ. వీటన్నిటికన్నా కార్లు, బంగళా, నౌకర్లు గొప్పవి కావు అనుకుంటుంది కుంతల. నెలలో ఏ రెండు, మూడు రోజులో తప్ప మిగతా రోజుల్లో బొంబాయి, కలకత్తా, ఢిల్లీ అంటూ తిరగడం కార్తీక్ అలవాటు. ఆ రెండు రోజులు కూడా ఇంటిపట్టున వుండడం ఏ కొన్ని గంటలో.

పెళ్ళై అయిదు సంవత్సరాలైంది. కానీ ఏనాడూ తను, కార్తీక్ పరిపూర్ణమైన ఆనందాన్ని పంచుకోలేదు. ఒక స్త్రీగా తను తృప్తిగా తన భర్తతో దాంపత్య జీవితాన్ని అనుభవించలేకపోతున్నాననే ఆవేదన తనలో మిగిలిపోయింది. అయిదు సంవత్సరాలైనా తన కడుపు కాయలేదు. కోట్లకు కోట్లు డబ్బు సంపాదించినా వాటికి వారసుడు లేకపోతే ఆ డబ్బుకి విలువ వుండదు. కానీ, కుంతల కోరుకునేది తన ఆస్తికి వారసుడు కాదు... తనకు మాతృత్వం ప్రసాదించే బిడ్డ. అప్పుడుగానీ తన స్త్రీత్వం పరిపక్వత చెందదు.

ఎన్నో రాత్రులు... కుంతల ఇటువంటి ఊహలతో ఖరీదైన డన్‌లప్ బెడ్ మీద, ఎయిర్ కండిషన్డ్ గదిలో అత్యధునాతనమైన వసతుల మధ్య నిద్రపోలేక కళ్ళు నులుముకుంటూ, ఆవులిస్తూ అద్దంలో తన అందాలను చూసుకుంటూ భర్త గురించి ఆలోచిస్తూ అటూ ఇటూ దొర్లేది... అలాగే ఈ రోజు కూడా... ఆస్తి కన్నా ముఖ్యమైనది అన్ని అనుభవాలను చవిచూసే జీవితం... ఆ జీవితాన్ని వివిధ కోణాలలో అనుభవించడం తెలుసుకున్న వ్యక్తి ఐశ్వర్యవంతుడి కన్నా గొప్పవాడు... అనుకుంటూ మరోసారి అద్దంలో చూసింది కుంతల.

* * *

బెంగుళూర్ హాలిడే ఇన్ హోటల్లో తన డీలక్స్ సూట్‌లో కూర్చుని ఆలోచిస్తున్నాడు కార్తీక్. అప్పుడు సమయం రాత్రి రెండు గంటలు. ఆ ఫ్లోర్‌లో ఇంచుమించు అన్ని గదులలోని దీపాలు ఆరిపోయాయి. అంటే వాళ్ళు గాఢ నిద్రలో మునిగిపోయారన్న మాట. కానీ కార్తీక్ మాత్రం ఇంకా సోఫాలో కూర్చుని ఆలోచిస్తున్నాడు.

లక్నోలో తను కొత్తగా మొదలుపెట్టబోయే గుండుసూదుల కంపెనీ గురించి ఆలోచిస్తున్న అతనికి ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్ నుంచి వచ్చిన నోటీసు గుర్తుకు వచ్చింది.

మూడు కోట్ల రూపాయలు మోసం చేశానని ఎక్సైజ్ ఆఫీసర్లు తనకు సమన్స్ పంపించారు. ఎందుకు? అసలు వ్యాపారవేత్తగా తాను ఏనాడూ ఎవ్వరినీ మోసం చేయలేదు. అలాంటప్పుడు ఈ సమన్స్ ఏమిటో అర్థం కాలేదు కార్తీక్‌కు. తన కంపెనీలలో పనిచేసే ఆఫీసర్లకు వాళ్ళు చేస్తున్న పనుల మీద కంట్రోల్ వుంది. ఇన్‌కమ్‌టాక్స్, ఎక్సైజ్ విషయాలలో తనకు సలహాలు ఇచ్చే అధికారులు కూడా తను పొరబాటు చేస్తున్నట్టు ఎప్పుడూ చెప్పలేదు. తను కూడా తన అధికారుల తెలివితేటల మీద, అనుభవం మీద నమ్మకంతో ఎన్నో ముఖ్యమైన కాగితాల మీద సంతకం పెట్టేవాడు. ఎన్నో కంపెనీలకు మేనేజింగ్ డైరెక్టరయిన తనకు మూడు కోట్ల రూపాయలు తలబద్దలు కొట్టుకోవలసినంత పెద్ద సైకం కాకపోయినా వున్నఫళాన అంత పెద్ద మొత్తం కట్టాలనడం కొంత ఇబ్బంది కలిగిస్తూంది. అంతేకాదు, ప్రజల దృష్టిలో ఒక మంచి సంస్థకు అధిపతిగా తను సంపాదించుకున్న ఇమేజ్ చెడిపోతుందేమోనన్న భయం వేసింది కార్తీక్‌కు. అవసరమైతే ఇరవై నాలుగు గంటల వ్యవధిలో ఆ పైకాన్ని తేగలడు. కానీ ఇందు మూలంగా దెబ్బతిన్న తన పరపతిని మళ్ళీ సంపాదించుకోగలడా? ఎన్నో సంవత్సరాల కృషి ఫలితంగా తను అధిరోహించిన ఉన్నత స్థానం లోంచి వున్నఫళంగా కిందికి దిగజారడం అంటే అంత సులభమైన విషయమా?

అసలు పొరబాటు ఎవరిది? తన సలహాదారులదా? లేక ఎక్సైజ్ డిపార్ట్‌మెంటుదా? పొరబాటు ఎవరిదైనా ముందు, ప్రభుత్వానికి కట్టవలసిన డబ్బు కట్టి ఆ తర్వాత కోర్టుకు వెళ్ళడం ఒక్కటే సముచితమైన మార్గం అనిపించింది కార్తీక్‌కు.

ఈ ఆలోచనలు అతని మస్తిష్కంలో అలజడి చేస్తుంటే, నిద్రపోవాలన్నా నిద్ర రావడం లేదు. ఆవులింతలు మాత్రం అప్పుడప్పుడు వస్తున్నాయి.

మెల్లగా లేచి మంచం ఎక్కాడు.

మెత్తని పరుపు మీద పడుకున్నాడు కార్తీక్.

నిద్ర మాత్రం రాలేదు.

పాపం... కుంతల ఏం చేస్తూందో...

తన బాధ వ్యాపారం గురించి.

కుంతల బాధ వారసుడి గురించి.

* * *

ఆ పెంకుటిల్లు యాభై సంవత్సరాల నాటిది. అక్కడక్కడా సిమెంటు పూత పెచ్చులు పెచ్చులుగా వూడిపోయి గోడలు అసహ్యంగా కనిపిస్తున్నాయి.

రెండు గదులు మాత్రమే వున్న ఆ ఇంట్లో ఒకటి వంట గది - రెండవది హాలు. ఆ గదినే పడక గదిగా కూడా వాడుకుంటారు. ప్రస్తుతం సమయం రాత్రి రెండు గంటలు. తుంపర పడుతూంది. రెక్కలు లేని కిటికీలో నుంచి ఈదురగాలి వీస్తూంది. నేల మీద చాప మీద రాఘవరావు, అతని భార్య సునంద, కూతురు శారద పడుకున్నారు. రాఘవరావు నిద్రపోతున్నాడని


పోస్ట్ మార్టమ్ కథలు
మాట్లాడని శవం చేత
మరణ రహస్యం చెప్పించేదే పోస్ట్‌మార్టమ్!
డాక్టర్ జి. సమరం
అతి త్వరలో

తదుపరి సీరియల్స్!
* జడలో జాబిలి
* పార్ట్ టైమ్ హజ్బెండ్
* నరనారాయణులు
మరియు
* శైలకుమార్ "డ్రీమ్ గర్ల్"



పేరేగాని అతని మెదడు నిండా ఆలోచనలే. రేపు శారదను చూడడానికి సాంబశివం వస్తాడు. అతనికి శారద నచ్చుతుందా? నచ్చినా, అతను ఎంత కట్నం కావాలి అంటాడో? అతను అడిగినంత తను ఇవ్వలేడు. శారద వయసు ఇప్పటికే ముప్పై దాటింది. ఊళ్ళో జనం తలోమాట అంటున్నారు. కానీ, తను ఏమీ చెయ్యలేని నిస్సహాయ స్థితిలో వున్నాడు.

కార్తీక్ ప్రైవేట్ కంపెనీలో హెడ్‌క్లర్క్ ఉద్యోగం చేస్తున్న తన నెల జీతం వెయ్యి రూపాయిలు. ఇద్దరు కూతుళ్ళకు పెళ్ళి చేశాడు. మరో ఆరు నెలలలో రిటైర్ కాబోతున్న తనకు శారద పెళ్ళి మిగిలిపోయింది. రిటైర్ అయిన తర్వాత వచ్చే ప్రావిడెంట్ ఫండ్ వగైరాలలో పెద్ద మొత్తం ఇప్పటికే పెళ్ళిళ్ళ కోసం తీసేసుకున్నాడు. మిగిలిన ఏ కొద్ది మాత్రం డబ్బుతోనో తను, తన భార్య శేషజీవితాలను గడపాలి.

మధ్యలో శారద పెళ్ళి. భవిష్యత్ చాలా అంధకారంగా వుంది. వర్షం వస్తే కురిసే ఇల్లు ఎప్పుడు పడిపోతుందో అనేలా వుంది.

మధ్య తరగతి బ్రతుకులు ఎప్పుడూ ఇంతే. ఈ ఆలోచనలతో రాఘవయ్య కళ్ళు మూసుకునే మేలుకున్నాడు.

శారద అటూ ఇటూ దొర్లుతూ నిద్ర రాక సతమతమవుతూంది. పెళ్ళీడు దాటి పది సంవత్సరాలైన శారద ఎప్పటికప్పుడు పేట్రేగిన కోరికలకు కళ్ళెం వేస్తూ వస్తూంది. వయసు చేసే అల్లరిని అదుపులో పెట్టుకుంటూ తండ్రి నిస్సహాయ స్థితిని అర్థం చేసుకుంటూ రోజులు గడుపుతూంది. ఆ వయసులో ఈదురుగాలి స్పృశించినప్పుడు ఆమె నరనరాలలో ఏదో సంచలనం మొదలైంది. అది దుప్పటికి లొంగనిది. అందుకే తన మనస్సును, కోరికలను నిగ్రహించుకోవాలని సతమతమవుతూంది శారద.

పగలంతా ఇంటి పనిచేసి అలసిపోయిన సునంద మగత నిద్రలో వుంది. ఆమె నిద్రపోవడం లేదు. అలసిపోయిన శరీరానికి కొంత విశ్రాంతిని ఇస్తూంది.

* * *

ఎదురింట్లో నిరంజన్, నిర్మల వాళ్ళ బాబును అప్పుడే నిద్రపుచ్చి, మంచమెక్కారు. ముంచుకు వస్తున్న నిద్ర కాస్త బాబు లేవడంతో మాయమైంది. ఇప్పుడు మళ్ళీ గంట వ్యవధి తర్వాత బాబు నిద్రపోతున్నాడు. "ఇప్పుడే కాసేపు విశ్రాంతిగా నిద్రపోకపోతే మళ్ళీ వాడు లేస్తే నిద్రమాని లేవక తప్పదు. అలా అప్పుడప్పుడు లేస్తూ పడుకుంటూ గడపడం వలన నరాలు బలహీనమైపోతాయి" అనుకుని ఇద్దరూ నిద్ర పోవాలని కళ్ళు మూసుకున్నారు.

బాబు మాత్రం ఈ లోకంతో తనకు పని లేదన్నట్టు గాఢ నిద్రలోకి జారిపోయాడు. ముక్కుపచ్చలారని ఆ అయిదేళ్ళ బాలుడికి జీవితం అంటే ఏమిటో తెలియదు. తల్లిదండ్రుల అనురాగం మాత్రమే చవి చూస్తున్న ఆ పసికందుకు సమస్యలు అంటే ఏమిటో తెలియవు.

ప్రతి మనిషి పసితనం దాటిన తర్వాత తృప్తిగా నిద్రపోలేడు. జీవితం అంటే ఏమిటో తెలుసుకునే వయసు వచ్చిన ప్రతి వ్యక్తి 'నిద్ర' అనే పేరుతో శరీరానికి విశ్రాంతి కల్పిస్తాడే కానీ మనసుకు విశ్రాంతి నివ్వలేడు. బరువుబాధ్యతలు, లాభనష్టాలు, కాంక్షలు, కోరికలు, కావేశాలు, సాధించవలసిన విషయాల మీది ఆలోచనలు, మెదడు నిండా చేరి తూనీగల్లా అల్లరి చేస్తుంటే ఏ వ్యక్తి నిద్రపోలేడు.

నిద్ర కేవలం... పసిపిల్లలకు మాత్రమే వస్తుంది... వాళ్ళే ఆదమరచి నిద్రపోగలరు... మిగిలినవాళ్ళు నిద్ర పేరిట పడుకున్నా... నిజంగా నిద్రపోలేరు. అందుకే జీవితంలో బాల్యాన్ని మించిన అపూర్వమైన దశ మరొకటి లేదు. అది ఒక్కసారే వస్తుంది. కొంతకాలమే వుంటుంది. అందుకే నిద్రించే భాగ్యం ప్రతి మనిషికి కొంతకాలమే వుంటుంది. కార్తీక్, కుంతల, రాఘవరావు, సునంద, శారద, నిరంజన్, నిర్మల ఇంకా అటూ ఇటూ దొర్లుతున్నారు - బాబుమాత్రం ఈ లోకంతో సంబంధం లేనివాడిలా తన ప్రపంచంలో తానున్నాడు. ●

## క్యాంపస్ జోక్స్

### భాష

విద్యార్థులలో సరైన భాషా జ్ఞానం కల్గించే పద్ధతులపై గోష్ఠి జరుగుతోంది. ఒక అధ్యాపకుడు లేచి "అతి సరళంగా చెప్పదగిన భావాన్ని అతి క్లిష్టంగా, డొంక తిరుగుడుగా తయారుచేసి విద్యార్థికి ఎటూకాని సంకర భాష అలవాటుచేస్తున్నారు. కొంత మంది 'పిల్లి' అనడానికి కనీసం 'మార్జాలం' అనైనా అనకుండా 'మూషికాస్రు కాస్వాదితానందోద్భవ పారవశ్య తన్వి" పడుకొంది అని రాస్తున్నారు. ఏమిటీ భాష" అన్నాడు.

గోష్ఠిలో ఒకరు లేచి "ఆ మాత్రం సాధ సమాసం వాడడంలో తప్పులేదు. ఈ రోజు విద్యార్థులలో బొత్తిగా వ్యుత్పత్తి నశించి పోతోంది" అన్నారు.

మరొకరు అడ్డు తగులుతూ చివర 'పడుకొంది' అనే ప్రయోగం ఏం బాగుంది? అని ప్రశ్నించారు. మరొకరు 'వ్యవహారిక భాషలో అలాగే రాయాల'న్నారు. అన్ని వేపుల నించి కొన్ని వాదోపవాదాలు చెలరేగాక అధ్యక్షులు ఎటూ తీర్మానించలేక 'గట్టిగా ఎవరి గొంతు వినిపిస్తే, ఎక్కువ గొంతులు దేనిని సమర్థిస్తే అదే రైటు. మనది ప్రజాస్వామ్యం కదా!" అని సర్దుబాటు చేశారు.



చివరకు విద్యార్థులు గ్రాంథిక వ్యవహారాలు కలగలిపి రాస్తే అది తప్పుగా నిర్ణయించాలని మూషికాస్రుకాస్వాది ఆనందోద్భవ పారవశ్యతన్వి పడుకొంది" లాంటి వాక్యాలు విద్యార్థులకు వ్యుత్పత్తి కల్గించే నిమిత్తమై వాడితే తప్పు లేదనే తీర్మానించారు.

— డాక్టర్ సి. ఆనందారామం